"సంఘ సంస్కరణ" నాటకం

# లోతు తెలియని ఈతగాడు

అవసరాల రామకృష్ణారావు

"నువ్వు వస్తావనుకోలేదు సుమా రఘూ!" రఘూని చూడగానే ఆప్యాయంగా ఆదరించి వేణు వెలిబుచ్చిన మాటలు యివి: "ఈ చిక్కు యెలా విడదీద్దామా, ఈ ముడి యెలా విప్పుదామా అని నా జ్ఞాపకశక్తి అంతా వుపయోగించి ఆలోచించాను. ఆదర్శాలను ఆచరణలో పెట్టే గుణం యింకా నీలోనైనా మిగిలి ఉందేమోనని నీకు రాశాను. నే అనుకున్నది రైటే అయిందన్నమాట. ఇంకా నీలాంటి వాళ్ళుండబట్టే సూర్య చంద్రులు నడిచి ఎదురుగుండా చక్కా రావడం లేదు!" ఆ స్తుతిలో సుంతయినా సుఖం కనిపించలేదు రఘూకి.

"అసలు విషయం చెప్పడం మానేసి మన స్వగుణ ప్రశస్తి ఎందుకు వేణూ! ఇలా కాలం వృథా చేసుకుంటే లాభం లేదు. నేను అతి కష్టంమీద ఒక్క రోజు సెలవు సంపాదించాను. నావల్ల జరిగే పని యేమిటో చెప్పూ."

వేణు చెప్పవలసిందంతా టూకీగా చెప్పి ఆఖర్ని యిలా అన్నాడు:

"ఆ పని నేనే చేద్దును. మా అమ్మకు వంట్లో బాగులేదనీ వెంటనే రమ్మని మా పెద్ద మామ వైరిచ్చాడు. అందుకే అంత అర్జాంతరంగా నీకు రాయవలసి వచ్చింది. ఇలాంటివి మన కళ్ళముందు జరుగుతూంటే సంస్కర్తలమని చెప్పుకునే మనం చూస్తూ ఊరుకోడం న్యాయం కాదు. నువ్వీ పనిని నిర్వహిస్తానని హామీ యిచ్చేదాకా నే కదలను."

ఇలాంటి అవకాశం దొరికినందుకు, సాధించడం కష్టమేమోనని లోలోన సంశయించినా– రఘు చాలా సంతోషించాడు. చేతల్లో చెప్పేవి తను ఎంతవరకు సాధించగలడో– తన న్యాయ సహకార శక్తి యెంతవరకు ఉందో తెలుసుకునే రోజు వచ్చినందుకు రఘు పొంగిపోయాడు. వేణుకి మాట యిచ్చి వెంటనే కార్యరూపధారణకు ప్రయత్నాలు చేశాడు.

* * *

"ఎవరక్కడ?" తలుపు సందుల్లోంచి చూస్తే అందరూ ఆడాళ్ళే కనిపించి కొంత వెనక్కి తగ్గిన రఘు, యీ మాటకు వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

"ఎవరా స్తంభంచాటున? మాట్లాడరేం?"

ఈసారి రఘు జవాబు చెప్పక తప్పలేదు. మాట్లాడేలోగా తలుపు సగం తెరుచుకుని అందులోంచి ఒక సువాసిని యువతలకు తల పెట్టి—

"ఏం కావాలండీ మీకు, ఎవరి కోసం?" అనడిగింది.

రఘు కొంత ధైర్యం తెచ్చుకుని,

"వెంకటచలం గారిల్లు యిదేనాండి?"

"వెంకటచలంగారు ఉన్నారా?"

ఇందాక అవునని ఊగిన తలే యిప్పుడు అడ్డంగా ఊగింది. అయినా అడిగాడు గాని వెంకటచలంతో తనకి పనేమిటి? ఆడవాళ్ళకు అన్ని విషయాలూ నచ్చజెప్పాలి గాని! ఇటువంటి విషయాల్లో ధైర్యం, చొరవ, అవసరమని యిలా అన్నాడు.

"సరేలెండి దానికేం– విషయం తెలియాలి గాని యెవరితో చెబితేనేం?"

"విషయమేమిటి?" అంది కృష్ణా గోదావరీ సమానురాలు.

రోడ్డుమీద మాట్లాడడం అసభ్యంగా తోచింది రఘూకి.

"ఒక ముఖ్యవిషయం మీతో చెబుదామని వచ్చాను. అలా లోపలికి వెళ్ళి మాట్లాడుదామా?"

"అక్కర్లేదు. ఇక్కడ చెప్పెయ్యొచ్చు"

ఇలాంటి మర్యాద చూసి చాలా నొచ్చుకున్నాడు రఘు. అయినా వెనుకంజ పనికి రాదని —

"ఈ ముఖ్యవిషయం యింట్లో అందరికీ నచ్చజెప్పాలని నా ఉద్దేశం. అదిగాక రోడ్డు మీద పోయేవాళ్లు మన మాటలు వింటే బాగుండదుగా."

ఆవిడ ఏమనుకుందో విసురుగా తలుపు తెరిచి లోపలికి వెళ్ళిపోయింది. ఆమాత్రం భాగ్యానికే రఘు ఎంతగానో సంతోషించి లోపలికి వెళ్లి ఎవరూ కూర్చోమనకుండానే అక్కడ భోషాణం మీద కూర్చున్నాడు. ఇందాక కనిపించిన జాతికి చెందిన మరో యిద్దరు ఓపక్క పసుపు దంపిస్తున్నారు. ఇంకొక ఆవిడ నీడలోకి వచ్చిన అప్పడాల్ని తిరిగి ఎండలో పెడుతోంది. గుమ్మంమీద కూర్చుని చెక్కలు దంపుతోంది మరొక ముత్తైదువ.

"పెళ్ళి పనుల్లో తీరిక చిక్క చస్తున్నాం నాయనా. ఏ కబురు వినడానికీ తీరిక లేదు. అంత ముఖ్యమైందటున్నావ్ అదేదో త్వరగా తేల్చెయ్."

"వెంకటచలంగారి భార్య ఎవరు?"

తలకి సడప చుట్టుకుని లోనుంచి వస్తున్న మరో పునిస్త్రీ, "ఏం నాయనా? ఎవరునువ్వు- నాతో పనేమిటి?" అంది కొట్టినట్టు.

ఆ అడగడం, ఆ తీరు, ఆ కర్కశ స్వరం వినేసరికి చెప్పవలసిన మాటలు సగం గొంతుకలోనే ఉండిపోయాయి రఘుకి. ఆఖరికి తేరుకుని, "మీ పిల్లకేనా ఏమిటి పెళ్ళి?" అన్నాడు.

"అవును. అయితే?"

"అమ్మా! మీరు మీ అమ్మాయి క్షేమం ఏమాత్రం విచారించినా ఈ పెళ్ళి జరగడానికి వల్లకాదు."

రోకలి మీద సుబ్బమ్మగారి చెయ్యి సరాసరి దవడల మీదకు వెళ్ళిపోయింది.

"ఆదేమిటీ?" అని సాగదీసుకున్నారు ఆడ మళయాళ మంతా.

"పెళ్ళంటే ఏమిటీ? మూన్నాళ్ళ ముచ్చట కాదు. నూరేళ్ళ పంట. తొందరపడి మధ్య వాళ్ళ మాట విని పిల్ల గొంతు కోసుకుంటారుటమ్మా? ..."

"ఆగవయ్యా ఆగు. యిహ చాలించు" మధ్యలో మాట ఆపేసి హడలిపోయి రఘు నిశ్చేష్టుడయ్యాడు.

"మాపిల్లను మేము యిష్టం వచ్చినట్టు చేసుకుంటాం. మధ్య నువ్వెవడివి? దాని యిష్టం, మా యిష్టమూనూ. శుభం పలకవే పెళ్ళికూతురా అంటే పెళ్ళికొచ్చిన వాళ్ళంతా నా మొగుళ్ళే అందిట, నీ లాంటి వ్యక్తే. శుభమా అని మేం పచ్చని తోరణం కట్టుకుంటే "గజేంద్ర మోర"లా నీ మొర ఏమిటయ్యా? ఏమిటో అనుకున్నాం. ఇదా నువ్వు చెప్పేది! అయినా యిదేదో మూడలేనివాళ్ళు పుట్టించిన వ్యవహారంలా ఉంది గాని దీని అంతేదో కనుక్కోక మానను. అబ్బాయి, నీ పేరేమిటీ? అసలు ఎవరు నువ్వూ?"

"ర... ర... రమణ మహర్షి ..."

పకపక నవ్వుల బ్యాక్‌గ్రౌండు మ్యూజిక్‌తో వెనక్కి తిరిగి చూడకుండా చకచక వీధిలోకి నడిచిపోయాడు రఘు.

* * *

"శ్యామల గారంటే మీరేనా?"

ముప్పై రెండు పళ్లు ఒక్కసారి నాట్యం చేసినట్టు నోరు పూర్తిగా విప్పి "అవును" అంది శ్యామల.

"మీకేనా పెళ్ళి"

"అవును" మళ్ళీ చిరునవ్వు నవ్వి "ఎవరు మీరు"?" అంది.

"మీలాంటి అసహాయుల్ని ఉద్ధరించడానికి వచ్చాను."

"నాలాంటి అసహాయుల్ని మీలాంటి వాళ్లు ఉద్ధరించడం యిప్పట్నుంచి కాదు - వాడు కొస్తా గుటుక్కు మననీయండి."

రఘు కళ్ళల్లోకి తన చూపులన్నీ ఫోకస్ చేసి అంది శ్యామల. రఘు ఆ చూపులు అయిదు నిముషాలేనా భరించలేకపోయాడు.

"ఉండండి వెళ్ళిపోకండి. ఆ బిందె అక్కడ దింపండి. మీతో మాట్లాడాలి" వెలగచెట్టు మొదట్లో బిందె దింపి ఆ ప్రక్కన కూర్చుంది శ్యామల.

"ఈ విషయం సీరియస్‌గా తీసుకోండి. మీరు పెళ్ళికొడుకుని చూసినట్టు లేరు. చూస్తే ఒప్పుకోరనుకుంటాను."

"చూడకేం, శుభ్రంగా చూశాను. దగ్గరగా చూశాను."

"అతనికి అరవై ఆరో ఏడుట. పదేళ్ళ క్రింద పక్షవాతం వచ్చిందిట."

"ప్రస్తుతం కీళ్ళ వాతం. ఎడంకన్ను గుడ్డి."

"అన్నీ తెలిసుండే మీరు చేసుకుంటున్నారన్న మాట!"

"అయ్యో! మీ తెలివి తక్కువ దేముడెత్తుకుపోనూ. యింకా బోధ పడలేదుటండీ మీకు! నేను వాడిని కాదండీ వరిస్తే, వాడి లక్ష్మిని! ఆ తరువాత మంచికీ చెడ్డకీ మీలాంటి వారు ఉండనే ఉన్నారుగా!"

కుడి చెయ్యి రఘు మెడ చుట్టూ వేసింది శ్యామల. ఆ చేతిని తీసి విదలించి పారేసి "ఛీ" అనుకున్నాడు రఘు.

* * *

"ఇదిగో, యిటు చూడండి."

రఘు మాటలు విని రంగనాయకులు యిటు తిరిగాడు.

"మీకే ఓ ఆడపిల్ల వుంటే, ఆవిడ గొంతుని కోసి, బ్రతుకంతా పాడుచేసి మీరిలాగే చేద్దురా?"

"నా కడుపున ఒక కాయే కాస్తే, నేను పెళ్ళే చేసుకోక పోదును రఘూ!"

"అదేమిటి? దానికీ దీనికీ ఏం సమ్మంధం?"

"ఓయి వెర్రినాయనా, నీ కింకా యీ ప్రపంచ పద్ధతులు సరిగ్గా తెలిసినట్టు కనిపించవు. తెలిస్తే యిలాంటి పనికి పూనుకోవు. నేనెందుకనుకున్నావు పెళ్ళి చేసుకుంటూంటా? ఈ వయసులో స్త్రీ సౌఖ్యాలకోసమా? శ్యామల అందచందాల కోసమా? డబ్బు, నాయనా డబ్బు! అన్నిటికీ సంబంధం యిదే అని తెలుసుకో. నా తమ్ముడితో, మరదలితో తెగతెంపులు చేసుకున్నాను. వారు నన్ను పెట్టిన బాధలు, అనుభవింప జేసిన అశాంతి అటువంటివి. ఈ ఆస్తి నాతదనంతరం నా తమ్ముడికి కాకుండా చెయ్యాలనే నేను పెళ్ళాడుతూంట. వాడు తక్కువవాడా? "ఈ ఆస్తి నాకెలా రాదో నేనూ చూస్తాను. ఇదిగో యివాళే మా స్నేహితుడు 'వేణు'కి యీ పెళ్ళి ఎలాగేనా తప్పించమని రాస్తూ నూరురూపాయిలు పంపుతున్నాను. వాడు దేవాంతకుడు- ఈ పెళ్ళి ఎలాగా తప్పించేస్తాడు" అని యెకుడుగుండా వచ్చి సవాలు చేస్తున్నాడు."

"వేణు! వేణుకి ఈ పెళ్ళి తప్పించెయ్యమని పెళ్ళికొడుకు తమ్ముడు లంచం పంపేశాడా?" రఘు బుర్ర గిరగిరా తిరుగుతోంది. ఆ తరవాత రంగనాయకులు అన్న మాటలు అతనికి వినిపించనే లేదు.

"నాయనా రఘూ, నీ పట్టుదలని నేను ప్రశంసిస్తున్నాను. కాని ఒక్క అభిమానంతో కూడిన హెచ్చరిక. చీకటిలోంచి వెలుగులోకి రాగానే మొదట కొద్దిసేపు కళ్ళు చీకట్లు కమ్ముతాయి. ప్రతిపనీ పూర్తిగా తెలియకుండానే అందులోకి దిగకు నాయనా"

రఘు సెలవు తీసుకుని రోడ్డుమీద పడ్డాడు. అడుగుకంటే అనేకరెట్లు అధిక వేగంతో చలించే భావపరంపరతో అతను అడుగు ముందుకు వెయ్యలేకపోయాడు.

"డబ్బు! డబ్బు!! డబ్బు!!! ఈ ప్రపంచంలో న్యాయం, ధర్మం, సభ్యత, సంఘబాధ్యత అన్నీ దానిముందు దిగదుడుపేనా? శ్యామల రంగనాయకుల్ని దేన్ని చూసి వరించింది? రంగనాయకులు శ్యామలను దేనికోసం పెళ్ళాడుతున్నాడు? ఇంతెందుకు? తన మిత్రుడు సంస్కరణ అనే మసిపూసి తన్ని యెందుకు పంపించాడు? ధనమే సాధనగాగల యీ సంఘాన్ని యెలా ఉద్ధరించడం? లక్ష్మీ కటాక్షమే లక్ష్యంగాగల యీ సమాజాన్ని యెలా బాగు చెయ్యడం? తను ఇన్ని అవమానాలు భరించడం ఏ ప్రతిఫలం కోసం? ఇన్ని సాలీళ్ళు గుమిగూడిన యీ బూజు నెలా దులపడం? స్వలాభం, స్వార్థం కొంచమయినా లేకుండా యెవరూ ఏపనీ చెయ్యక పోతే దేశం ఏమౌతుంది?"

"ఇలాంటి సమాజంలో నేనెందుకూ?" అనుకున్నాడు రఘు. చావలేక చచ్చినట్టు బతుకుతున్నాడు రఘు!